## టీచర్స్ డేలోపు కొత్త వీసీలను నియమించాలి

ఉస్మానియాయూనివర్సిటీ: రాష్ట్రంలోని వర్సిటీలకు టీచర్స్ డే లోపు కొత్త వీసీలను నియమించాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య డిమాండ్ చేశారు. వైస్ చాన్సలర్స్ పదవీ కాలం ముగిసి నాలుగు నెలలు గడుస్తున్నా గత వీసీల నిర్ణయాల మేరకే పాలన వ్యవహారాలు కొనసాగుతున్నాయని అన్నారు. వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలుగా ఐఏఎస్ అధికారులను నియమించినా కేవలం సంతకాలకు పరిమితం కాగా పాలన మాత్రం గత వీసీలు వర్సిటీల్లో నియమించిన ప్రిన్సిపల్స్, డీన్లు, డైరెక్టర్లు, ఇతర అధికారుల చేతుల మీదుగా కొనసాగుతుందన్నారు. తక్షణం కొత్త వీసీలను నియమించి వర్సిటీల పాలనలో మార్పు తేవాలని నెల్లి సత్య కోరారు.

## భక్తిశ్రద్ధలతో మాతాకీ చౌకీ

సనత్‌నగర్: కాపు సంఘం ట్రస్టీస్, మున్నూరు కాపు మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని కాపు సంఘం భవనంలో శనివారం సాయంత్రం 'మాతా కీ చౌకీ' కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భజనలు, కీర్తనలతో అమ్మవారి సేవలో తరించారు. ఈ ఉత్సవాలకు పీసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమెను మున్నూరు కాపు మహిళా సంఘం అధ్యక్షురాలు అన్నం మంజుల తదితరులు ఆమెను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ గున్నాల శ్రీనివాస్, కోశాధికారి అన్నం మనోజ్, ట్రస్ట్ మెంబర్ సామల రామకృష్ణ, అల్లాడి గీత, విశాల్ సూదం పాల్గొన్నారు.

సమస్యల వలయంలో

# ఇండోర్ స్టేడియం

- వర్షం కురిసిన ప్రతిసారి స్టేడియంలోకి నీరు
- ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు
- నిర్వహణను గాలికొదిలేసిన జీహెచ్‌ఎంసీ

లైట్లు పనిచేయకపోవడంతో అంధకారంలో 'ఇండోర్'



అంధకారంలోనే అడిక్‌మెట్ మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని అడిక్‌మెట్ మినీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. వర్షపునీరు స్టేడియంలోకి రావడంతో క్రీడాకారులు జారి పడుతున్నారు. సుమారు 120 ట్యూబ్ లైట్లలో 30 లైట్లే పనిచేయడంతో స్టేడియంలో అంధకారం నెలకొంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు ఫిర్యాదు చేస్తే ఆయన జోనల్ కమిషనర్‌కు లేఖ రాశారు. అయినా ఇప్పటి వరకు స్పందించకపోవడం గమనార్హం. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యానికి, ప్రజాప్రతినిధుల ఉదాసీన వైఖరికి సాక్షిభూతంగా నిలుస్తోంది.

### వినియోగంలో కేవలం నాలుగు కోర్టులే..

◆ ఇండోర్ స్టేడియంలో నాలుగు షెటిల్ కోర్టులు, యోగా, జిమ్, కరాటే, టేబుల్ టెన్నీస్ వంటి క్రీడా కోర్టులను ఏర్పాటు చేశారు. అందులో కేవలం నాలుగు షెటిల్ కోర్టులు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. మిగతా క్రీడా కోర్టులను గాలికి వదిలేశారు. ఈ ఇండోర్ స్టేడియంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సుమారు 120–150 మంది వరకు షటిల్ ఆడుతారు. సుమారు రూ.4కోట్లతో పదేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. నాలుగేళ్ల క్రితం నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ స్పోర్ట్స్ కంప్లెక్స్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించారు.

### తలా ఇంత డబ్బులేసుకుని..

షెటిల్ క్రీడాకారులు అసోసియేషన్‌గా ఏర్పడి స్టేడియానికి కావాల్సిన కనీస సౌకర్యాలను చూసుకుంటున్నారు. క్రీడాకారులు తలా ఇంత డబ్బులేసుకుని రూ.50వేలతో అధునాతన నెట్‌లు ఏర్పాటు చేసుకున్నారు. చివరకు ఫ్యాన్‌లు, బెంచీలు, కర్టెన్స్, డస్ట్ బిన్ డబ్బాల ఏర్పాటు సైతం సొంత డబ్బుతో చేసుకున్నారు. వాటికి బిల్లులు పెడితే డబ్బులు మంజూరు చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకు తిరిగి ఇవ్వకపోవడం గమనార్హం. క్రీడాకారులకు మంచినీటి వసతులు కూడా లేకపోవడంతో నాయిని ఫౌండేషన్ వారు ముందుకొచ్చి ఆర్‌వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేసి సౌకర్యాలు కల్పించాలని క్రీడాకారులు డిమాండ్ చేస్తున్నారు.



షటిల్ కోర్టులో చేరిన వర్షపునీరు

### మరమ్మతులు చేపట్టండి



అడిక్‌మెట్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ రాంనగర్, విద్యానగర్, అంబర్‌పేట్, ముషీరాబాద్, పద్మారావునగర్‌లతో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి 150 మందికిపైగా క్రీడాకారులు ప్రతి రోజు వస్తుంటారు. కానీ వారికి కావాల్సిన కనీస సౌకర్యాలు జీహెచ్‌ఎంసీ కల్పించకపోవడం విచారకం. ప్రస్తుతం ఈ కోర్టులో లైటింగ్ పూర్తిగా పోవడంతో చీకటి అలుముకుంది. జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికి స్పందన కరువైంది. కాబట్టి జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ విభాగం అధికారులు వెంటనే ఈ లైటింగ్‌తో పాటు ఇతర క్రీడా కార్యక్రమాలను కూడా చేపట్టాలని కోరుతున్నాం.

– ఎంఎస్ చారి, క్రీడాకారుడు

### లైటింగ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నా..



ఇండోర్ స్టేడియంలో నెలకొన్న సమస్యలపై ఇటీవల క్రీడాకారులు నా దృష్టికి తీసుకొచ్చారు. అనేకసార్లు ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి అధికారులతో ఫోన్‌లో మాట్లాడాను. తాజాగా జోనల్ కమిషనర్‌కు లైటింగ్ ఏర్పాటు చేయాలని లేఖ కూడా రాశాను. మరోసారి జోనల్ కమిషనర్‌తో మాట్లాడి త్వరలో సమస్యకు పరిష్కారం లభించేలా కృషి చేస్తాను. – ఎమ్మెల్యే ముఠా గోపాల్

## 'కేంద్ర - రాష్ట్రాల మధ్య సహృద్భావం ఉండాలి'

లాలాపేట: కేంద్ర – రాష్ట్రాల మధ్య సహృద్భావమైన వాతావరణం ఉంటేనే ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని రైల్వే డిగ్రీ కళాశాల పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డు ప్రొ. డా. పి.మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు శనివారం సెయింట్ పాయిస్ డిగ్రీ, పీజీ కళాలలో కేంద్ర – రాష్ట్ర సంబంధాలు అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రావు మాట్లాడుతూ.. గవర్నర్లు రాజ్యాంగబద్ధంగా నిర్వహించకుండా కేంద్రంలోని అధికార పార్టీకి ఏజెంట్లుగా వ్యవహరించడం సరైన విధానం కాదన్నారు. కేంద్రం, రాష్ట్రాలు బలంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల కొరత ఉందన్నారు. దీంతో పాలన కుటుంపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ ప్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే క్షేత్రస్థాయి పర్యటన

బన్సీలాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య వెల్లడించారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిసర ప్రాంతాల్లో దోమల నిర్మూలన కోసం చేస్తున్న ఫాగింగ్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి పర్యటనతో అనేక విషయాలు తెలుస్తున్నాయని ఇటు సిబ్బంది సక్రమంగా పనిచేయడంతో పాటు ప్రజలతో నేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు. బస్తీలు, కాలనీ, ఇతరత్రా సంఘాలతో సమావేశాలను నిర్వహించి దోమల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నట్లు తెలిపారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట మలేరియా విభాగం ఏఈ శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు

సనత్‌నగర్: శని త్రయోదశి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయంలో శనివారం సాయంత్రం శ్రావణ మాస విశేష పూజలను ఘనంగా నిర్వహించారు. దేవస్థాన ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాలకు ప్రవచనకర్త డాక్టర్ అనంత లక్ష్మీ హాజరై శ్రావణమాసం, శని త్రయోదశి విశిష్టతలను గురించి వివరించారు. అంతకముందు ఆలయంలో 1008 మహిళలతో లలిత, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, లింగాష్టకం, హనుమాన్ చాలీసా పారాయణం, సామూహిక శ్రావణ మంగళగౌరీ మహాలక్ష్మీ కుంకుమార్చన, లక్ష్మీనారాయణ నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ అర్చక, ఉద్యోగ జేఏసీ కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు, అర్చకులు రిపుంజయశర్మ, గోపాల్‌జోషి, వెంకటేశ్వర్లు, దేవస్థానం సూపరింటెండెంట్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ నేత సంజయ్ ఆరోగ్య పరిస్థితి విషమం

అపోలో ఆస్పత్రికి తరలింపు

గాంధీఆస్పత్రి: కుల గణన చేపట్టాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ గత ఏడు రోజులుగా ఆమరణ దీక్ష చేపట్టిన బీసీ సంఘ నాయకుల్లో ఒకరైన జక్కని సంజయ్ కుమార్ ఆరోగ్యం విషమించడంతో మరింత మెరుగైన వైద్యసేవల కోసం శనివారం రాత్రి 10.30 గంటల సమయంలో ఆయనను గాంధీ ఆస్పత్రి నుంచి సికింద్రాబాద్ ఆపోలో ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రి వైద్యులు పట్టించుకోవడం లేదని, గత మూడు రోజులుగా హెల్త్ బులెటిన్ విడుదల చేస్తామని ప్రకటించి, నేటి వరకు విడుదల చేయలేదని పలువురు బీసీ సంఘ నేతలు ఆరోపించారు. బీసీలపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కపటప్రేమ చూపిస్తుందన్నారు. శనివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురైన సంజయ్‌కుమార్‌కు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు గాంధీ ఆస్పత్రికి చెందిన వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆయన ప్రాణాలకు ప్రమాదం ఉందని గమనించి అపోలో ఆస్పత్రికి తరలించామని బీసీ సంఘ నాయకులు పేర్కొన్నారు. గత ఏడు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సంజయ్‌కుమార్ అస్వస్థతకు గురై వాంతులు చేసుకోవడంతో ఆయనను అపోలో ఆస్పత్రిలో చేర్పించామన్నారు.



సంజయ్‌కుమార్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న బీసీ సంఘ నాయకులు

## కాంగ్రెస్ హామీలను అమలు చేయాలి

గాంధీఆస్పత్రి: తెలంగాణలో కులగణన చేపడతామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కే నారాయణ డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు గత వారం రోజులుగా సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో ఆమరణదీక్ష కొనసాగిస్తున్న బీసీ నాయకులు జక్కని సంజయ్ కుమార్, బత్తుల సిద్ధేశ్వర్‌ను శనివారం ఆయన పరామర్శించి మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం జోక్యం చేసుకుని బీసీ నాయకుల డిమాండ్లను పరిశీలించి నిరాహార దీక్షలను విరమింపజేయాలని కోరారు. సీపీఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల్‌మల్లేష్, మేడ్చల్ జిల్లా పార్టీ కార్యదర్శి డీజీ సాయిలుగౌడ్ పాల్గొన్నారు.

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరి మృతి

అడ్డగుట్ట: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శనివారం ఉదయం 7గంటల సమయంలో మల్కాజ్‌గిరికి చెందిన నర్సింహరావు(63) మౌలాలి–లాలాగూడ రైల్వే స్టేషన్ల మార్గం మధ్యలోని పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టింది. ఈ క్రమంలో తీవ్ర గాయాలపాలైన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

### రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నం .1లోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద శనివారం ఉదయం 7.30 గంటల సమయంలో సుమారు 40–45 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. ఇది గమనించిన రైల్వే పోలీసులు అతని వద్దకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు సెక్యూరిటీగార్డు డ్రెస్ ధరించాడని, దానిపై జీఎస్‌ఎస్ అని లోగో ఉందని తెలిపారు.

## అందరి సహకారంతో ఎస్సీ వర్గీకరణ సాధించాం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మందకృష్ణకు జ్ఞాపిక బహూకరిస్తున్న నాగులూరి సాయిబాబా

చిలకలగూడ: అందరి సహాయ సహకారాలతో ఎట్టకేలకు ఎస్సీ వర్గీకరణ సాధించామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. నాగులూరి నర్సింహ వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు, దళిత సంఘ సేవకుడు నాగులూరి సాయిబాబాను శనివారం ఆయన స్వగృహంలో మందకృష్ణ మాదిగను కలిసి శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ పోరాట ఉద్యమానికి సాయిబాబా తన సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో పాటు అన్నివిధాల సహకరించారని మందకృష్ణ ధన్యవాదాలు తెలిపారు. సంఘ సేవకుడు సాయిబాబా ప్రజాక్షేత్రంలోని వస్తే నిరుపేదలు, దళితులకు మరింత అండదండగా ఉంటారని అన్నారు. ఆయనకు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకత్వం పూర్తిగా సహకరిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగకు జ్ఞాపికను బహూకరించి శాలువాతో సన్మానించారు. పలు దళిత సంఘ నాయకులు, అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి..

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు డ్రగ్స్ నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏసీపీ రమేష్

రసూల్‌పురా: పాఠశాల, కళాశాలల విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని కొందరు ముఠాలుగా ఏర్పడి నగరంలో మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నారని తిరుమలగిరి ఏసీపీ గుజ్జా రమేష్ పేర్కొన్నారు. తిరుమలగిరి ఇన్‌స్పెక్టర్ జి.నాగరాజు ఆధ్వర్యంలో సేయింట్ జోసెఫ్ స్కూల్‌లో మాదక ద్రవ్యాలు – సైబర్ నేరాలు వ్యక్తిత్వ నిర్మాణంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్రపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ రమేష్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించాలన్నారు. సెల్‌ఫోన్లలో వచ్చే లింక్‌లను ఓపన్ చేయొద్దని సూచించారు. ఇటీవల చాక్లెట్ల రూపంలో పాన్ డబ్బాల్లో విక్రయాలు జరుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. పలువురిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేసి జైలుకు పంపించామని తెలిపారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సై అంతాయమ్మ, ప్రిన్సిపల్ జోసెఫ్, కో–ఆర్డినేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డా. మారియా మాంటిస్సోరి జయంతి ర్యాలీ



రాంగోపాల్‌పేట్: ప్రముఖ ఇటాలియన్ విద్యావేత్త అయిన డా. మారియా మాంటిస్సోరి జయంతి శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు నెక్లెస్ రోడ్డులోని సంజీవయ్య పార్కు వద్ద భారీ ర్యాలీ నిర్వహించారు. మాంటిస్సోరి ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ట్రస్ట్ సహకారంతో 21 పాఠశాలలకు చెందిన 900 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి ప్రపంచ వ్యాప్తంగా విద్య కోసం ఆమె సేవలను గుర్తు చేసుకున్నారు. ఆమె తీసుకుని వచ్చిన విద్యా విధానాన్ని ప్రపంచం మొత్తం నేటికి ఆచరిస్తుందని కొనియాడారు.

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: తెలంగాణ ప్రభుత్వం మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను లాలాపేటలో ఏర్పాటు చేశారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి శనివారం క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ క్యాంటీన్‌లో అన్ని రకాలైన టిఫిన్స్, చాయ్, కాఫీ అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీపీఓ శ్రీనాథ్, సీఓ శ్రీవాణి, మహిళా స్వయం సహాయక సంఘాలు, మహిళా సమాఖ్యలు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, ఆర్పీలు పాల్గొన్నారు.

## బేగంపేట విమానాశ్రయ డైరెక్టర్ పీకే హజారికి వీడ్కోలు



బేగంపేట విమానాశ్రయం డైరెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందిన పీకే హజారిని సన్మానిస్తున్న ఉద్యోగులు

సనత్‌నగర్: బేగంపేట విమానాశ్రయం డైరెక్టర్‌గా మూడేళ్లుగా సేవలు అందిస్తున్న పీకే హజారి శనివారం ఉద్యోగ విరమణ పొందారు. విమానాశ్రయ ఉద్యోగులు పీకే హజారిని సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. పీకే హజారి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వరుద వీ రావు కొనియాడారు. తన ఉద్యోగ జీవితంలో తోటి ఉద్యోగులతో సన్నిహిత సంబంధాలు నెరిపి అందరి ఆదరాభిమానాలు చూరగొన్న పీకే హజారి శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్లు గోపకుమార్, కేఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

### టీజీపీసీబీలో జేసీఈఈ గంగాధర్..

తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ గంగాధర్ శనివారం ఉద్యోగ విరమణ చేశారు. 36 ఏళ్లుగా ఆయన అందించిన సేవలను సభ్య కార్యదర్శి రవి కొనియాడారు. ఉద్యోగ జీవితంలో రీమార్క్ లేని జీవితమే నిజమైన జీవితంగా పేర్కొన్నారు.

## సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సారంగపాణి

అడ్డగుట్ట: సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. ఈ మేరకు శనివారం అడ్డగుట్ట డివిజన్ ముఖ్య నాయకుల సమావేశంలో అధ్యక్షుడు కన్నాభిరామ్ ఆధ్వర్యంలో జరిగింది. ప్రతి బూత్ నుంచి దాదాపు 300 మంది సభ్యత్వం తీసుకునేలా కృషి చేయాలని సారంగపాణి సూచించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోనే అడ్డగుట్ట డివిజన్‌ను సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. అన్ని వర్గాల ప్రజలను సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నరేందర్, కృష్ణ, నర్సింగ్‌రావు, సాయిబాబా, రవీందర్, మహేందర్, వేణుగోపాల్, విజయ్, కళావతి, హంసరాజ్, స్వామి, శ్రీనివాస్, శంకర్ తదితరులున్నారు.

## ప్రా. పురుషోత్తంకు వీడ్కోలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అర్థశాస్త్రం విభాగం అధ్యాపకులుగా పని చేస్తున్న ప్రొ.ఇటికాల పురుషోత్తం ఉద్యోగ విరమణ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా వీడ్కోలు పలికారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ 133 తరగతి గదిలో డా. దుబ్బ రంజిత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషన్ డా.తిప్పర్తి యాదయ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సామాజికవేత్త, తెలంగాణ ఉద్యమానికి, ఓయూకు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం ప్రొ.పురుషోత్తం, అతని సతీమణి రమాబాయిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓయూ అధ్యాపకులు రాములు, అర్జున్ రావు, మల్లేశం, కాశీం, వంశీధర్, డైసీ, తిరుపతి, నలిగంటి శరత్, విద్యార్థి నేతలు వరంగల్ రవి, చనగాని దయాకర్, ఆర్ఎన్ శంకర్, వలిగొండ నరసింహ, యుగేందర్, పాల్వాయి నగేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## పీజీ ప్రవేశాలకు ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీలతో పాటు ఇతర పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 5 నుంచి ప్రత్యేక కేటగిరి (సీఏపీ, ఎన్‌సీసీ, పీహెచ్) అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయనున్నట్లు టీజీ సీపీజీఈటీ–2024 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి శనివారం తెలిపారు. ఓయూ క్యాంపస్‌లోని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ కార్యాలయంలో ఈ నెల 5, 6, 8, 9 తేదీల్లో సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడవచ్చు.

## లైంగిక వేధింపులు గుర్తించడంపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న నందిని మల్లు

సనత్‌నగర్: పిల్లలు లైంగిక వేధింపులకు గురయ్యే అవకాశాలు ఉన్న అంశాలను గుర్తించగలిగితే అప్రమత్తం కావొచ్చని, తద్వారా పిల్లలకు తగిన సూచనలు చేయవచ్చని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని మల్లు అన్నారు. యంగ్ ఇండియన్స్ (వైఐ), కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండస్ట్రీ (సీఐఐ), మాసూమ్ తదితర సంస్థల ఆధ్వర్యంలో 'కీపింగ్ చిల్డ్రన్స్ సేఫ్' అనే అంశంపై శనివారం నిర్వహించిన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. లైంగిక వేధింపులను గుర్తించడంలో పిల్లలకు సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎదుటి వ్యక్తులు తమను తతాకే విధానం ఏంటో ఆడ పిల్లలకు తెలుసుండాలని, అలాగే ఎదుటి వారి వారి వ్యవహార శైలిని గుర్తించగలగాలన్నారు. లైంగిక దాడికి గురయ్యే బాధిత మహిళలు మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందని, ఒకవేళ అటువంటి లక్షణాలు ఏమైనా కనిపిస్తే మానసిక నిపుణుల ద్వారా చికిత్స అందించడం మంచిదన్నారు. ఐపీఎస్ అధికారిణి రెమా రాజేశ్వరి మాట్లాడుతూ.. చుట్టుపక్కల వాతావరణంలోనే బాలికలు లైంగిక వేధింపులకు గురయ్యే అవకాశాలు ఉంటాయని, తల్లిదండ్రులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలు తమకు జరిగిన అన్యాయాన్ని తల్లిదండ్రులకు ధైర్యంగా చెప్పుకోగలిగే భరోసా కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పింకిరెడ్డి, రాయ్ కొదాలి, యంగ్ ఇండియన్స్ ఛైర్‌పర్సన్ శివానీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వరుస రోడ్డు ప్రమాదాలు

బీజేపీ నేత మేకల సారంగపాణి



తార్నాక చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

లాలాపేట: రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు విభాగం నిర్లక్ష్యంతోనే ఇటీవల వరుస రోడ్డు ప్రమాదాలు సంభవించి అభం శుభం తెలియని విద్యార్థులు చనిపోతున్నారని బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. ఈ మేరకు తార్నాక అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో శనివారం తార్నాక చౌరస్తాలో బీజేపీ నేతలు రోడ్డుపై బైఠాయించారు. ఆగస్టులో హబ్సిగూడలో రోడ్డు ప్రమాదంలో మరణించిన ఇద్దరు విద్యార్థినుల ప్రమాదంపై 'సాక్షి'దినపత్రికలో ప్రచురితమైన కథనాల ప్లకార్డులను ప్రదర్శించారు.

◆ ఈ సందర్భంగా సారంగపాణి మాట్లాడుతూ... నెల రోజుల వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమని అన్నారు. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే అని విమర్శించారు. ప్రభుత్వం స్పందించి వెంటనే బాధిత విద్యార్థి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

◆ ఇప్పటికైనా ప్రభుత్వం, పోలీసు విభాగం మేల్కొని సిబ్బందిని పెంచి స్కూల్ సమయాల్లో ప్రతి చౌరస్తాలో ప్రత్యేకంగా ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలన్నారు. హబ్సిగూడలో రోడ్డు ప్రమాదాల నివారణకు రహదారిని విస్తరించడంతో పాటు చౌరస్తాను మూసివేసి అండర్ గ్రౌండ్ రూట్, యూ టర్న్‌లను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను అందుబాటులోకి తేవాలన్నారు.

◆ ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్‌గౌడ్, రవిప్రసాద్‌గౌడ్, వేణు, హరి, ప్రకాష్‌గౌడ్, వీరన్న, శారదా మల్లేష్, సుబ్బారావు, భిక్షపతి, అంబాల రాజు,హన్మంత్, రమేష్, గండికోట నర్సింహ్మా, రాజేష్, శ్యామ్ సుందర్, సరోజ,అనిత, ప్రమోద్‌కుమార్, కృష్ణమూర్తి, రాజు జైన్,గోవర్ధన్, కుమార్, ప్రతాప్ తదితరులున్నారు.

## సేవలే గుర్తింపునిస్తాయి..

గాంధీఆస్పత్రి: చిత్తశుద్ధి, నిబద్ధతతో అందించిన సేవలే అధికారులకు గుర్తింపు ఇస్తాయని గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి అన్నారు. టీఎన్‌జీవో గాంధీయూనిట్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన అభినందన సభలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ చేసిన భమిడిపాటి రామయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. సుమారు నాలుగు దశాబ్దాల పాటు వివిధ కీలక హోదాల్లో పనిచేసిన రామయ్య ఉన్నతాధికారుల మన్ననలు పొందారని అన్నారు. 1985లో గాంధీఆస్పత్రిలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన రామయ్య ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఉస్మానియా, డీఎంఈ కార్యాలయం తదితర మెడికల్ విభాగాల్లో అద్వితీయమైన సేవలు అందించారని కొనియాడారు. రామయ్య, జయప్రద దంపతులకు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్ కుమార్, ఏడీ ఫ్లోరెన్స్‌మర్లిన్, టీఎన్‌జీవో గాంధీయూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్, ప్రసన్న, సరళ, భావన, శ్రీమన్నారాయణ, టీఎన్‌జీవో ప్రతినిధులు శ్రవన్, ఖలీల్,మక్సూద్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379